కథ

# చెప్పుకోండి చూద్దాం...

కె.కె. రఘునందన

తన భార్య చాందినికి కథలు కాకరకాయలు రాయడం వచ్చంటే ఆ అభిరుచికి తెగ పొంగిపోయాడు యాదగిరి. వెన్నెల్లో చెట్టాపట్టాలేసుకు తిరగడం యిష్టమంటే ఆనందించాడు. వంటింట్లోంచి కదలకుండా షడ్రుచులు చేసి పెడుతూంటే మరింత ఉబ్బిపోయాడు.

మరీ అంతలా పాలునీళ్లలా కలగలసిపోయిన ఆ దంపతుల మధ్య ఏం జరిగిందో ముందు ముందు మీకే తెలుస్తుంది.

* * *

మెట్టింట్లో అడుగిడిన మూడోరోజే మొదలెట్టింది చాందిని.



''ఏమండీ- పెళ్ళయినప్పటినుండీ మీకూ నాకూ ఇద్దరికీ తీరిక లేదాయె. మనలో ఎవరికి ఎక్కువ ప్రజెంటేషన్స్ వచ్చాయో చూసుకుందామా?'' అని ఒక్కో ప్యాకెట్ విప్పారు.

అన్నీ విప్పాక పకపక నవ్వుతూ ''చూశారా, నాకే ఎక్కువగా వచ్చాయి. అంటే నాకు అంగ బలం, బంధుబలగం ఎక్కువని ఒప్పుకుంటారా?''

యాదగిరి ఉడుక్కున్నాడు.

''ఏమండీ! నాదో మనవి. వీటితో పాటుగా నాతో పుట్టింటినుంచి తెచ్చుకున్న ఆభరణాలు చూపిస్తానండీ..'' అంది గోముగా.

''దానికంతగా చెప్పాలా చూపించు'' అన్నాడు యాదగిరి.

ఒకటొకటే బయటకు తీసింది.

వడ్డాణం, రవ్వల నెక్లెసు, గుళ్లపేరు, పచ్చల పతకం, చంద్రహారం, పాపిడి పిందె.

చివరగా- ''ఇది కూడా చూడండి'' కిసుక్కున నవ్వుతూ చూపించింది.

''ఏయ్! నీకూ... ఇప్పటికీ ఇంకా నీ దగ్గరుంచుకున్నావా!'' చిలిపిగా అని నవ్వాడు.

''మా తాత దీన్ని చేయించాక చనిపోయాడు. ఆయనకు నేనంటే ప్రాణంట.. అందుకనే నేను దీన్ని గుర్తుగా దాచుకున్నాను''

''పోనీ....నీ ఇష్టాన్ని నేనెందుకు కాదనాలి... అబ్బ రెండు తులాల బరువుంటుంది... కానీ ఓ షరతు''

''ఏమిటో?'' చిత్రంగా చూసింది చాందిని.

''దీన్ని ఎప్పుడూ బయటకు తీయకుండా పెట్టె అడుగున దాచెయ్యి...'' అన్నాడు యాదగిరి.

''పోదురూ బడాయి...'' అనేసి వస్తువులన్నింటినీ దంతపుపెట్టెలో పెట్టి, బీరువాలో భద్రపరిచింది.

★ ★ ★

ఒకరోజు సాయంత్రం-

యాదగిరి ఇంట్లో అమ్మలక్కల హడావుడి. బండి స్టాండ్ వేసి లోపలికి అడుగుపెట్టాడు. ఆడవాళ్ల మధ్య నుండి పోవడానికి ఇష్టపడక పెరటి ద్వారం గుండా తనగదిలోకి చేరాడు.

''మా బామ్మ పునిస్త్రీగా వున్న రోజుల్లో ఈ వడ్డాణం చూడ్డానికి ఊర్లో ఆడాళ్ళు ఎగబడేవారట. ఆవిడ పోతూ నాకిమ్మని చెప్పిందట. నేనప్పటికి చంటిదాన్ని. మరి ఈ పాపిడి పిందె ఉందే... దీన్ని మా శంకరాభరణం మామయ్య చేయించి పెట్టాడు. ఇంక చివరిగా...'' అని ఆగింది చాందిని.

''అవేమిటి చందూ... గుప్పెట్లో దాచావు అంత రహస్యమా'' ఓ కీచుగొంతు ప్రశ్న.

''నా ప్రాణాతి ప్రాణంగా దాచుకున్న ఈ వస్తువు. మా తాతయ్య ప్రేమగా నాకు చేయించి తను పోయాడు'' అన్నది బాధగా.

''అయ్యో! అలాగా... ఏదీ మీ తాతగారి ప్రియమైన కానుక...'' వెంగమ్మగారు అడిగారు.

''చూడండి'' అని గుప్పెట తెరిచింది.

అంతే ఘొల్లున నవ్వులు.

''ఎర్రపాడి మధ్యలో ధగధగలాడుతూంది. అసలే నువ్వు ఎర్రటి పిల్లవి... అందుకనే పొదిగి వుంటారు''

మళ్ళీ పకపకలు.

ఆ దృశ్యం చూస్తుంటే యాదగిరికి ఎక్కడ్లేని మంటలు పుట్టుకొచ్చాయి.

వారంతా నిష్క్రమించాక ఒక్క ఊపుతో గది లోంచి దూసుకెళ్లాడు.

''చాందినీ! నీకు నేనేం చెప్పాను. నువ్వేం చేస్తున్నావు?'' బిగ్గరగా అడిగాడు.

''నేనేం పేరంటం పిలవలేదు. మన పొరుగింటి పుల్లమ్మ కూతురు చాపెక్కింది. పోతూ పోతూ వచ్చి కూర్చున్నారు. వచ్చారు కదాని చూపించా...''

''చూపించడానికి నీకు సిగ్గులేదూ! నాకు చచ్చేంత అవమానంగా వుంది'' చికాగ్గా అన్నాడు యాదగిరి.

''మన వస్తువులు మనం చూపించుకోవడం మీకు అవమానమా?'' తేలిగ్గా అనేసింది చాందిని.

''ఏదైనా చూపించు... 'అది' మాత్రం వద్దని షరతుపెట్టానా లేదా?''

''తెలుసు. కానీ మా తాతగారి ప్రేమను ఈవిధంగానైనా చాటుకోవాలని నాకుండదా!'' గోముగా అంది.

''మీ తాత ప్రేమ మండినట్టే వుంది గాని ఈ రాద్ధాంతం యింతటితో కట్టిపెట్టు. ఈసారి అలా జరగడానికి వీల్లేదంతే...'' గొంతు పెంచాడు యాదగిరి.

★ ★ ★

ఆదివారం ఉదయం-

పచారీ సామాన్లు తేవడానికి బయలుదేరాడు యాదగిరి.


''హల్లో గిరీ! ఆగాగు. నిన్ను కలుద్దామని నేనొస్తుంటే నువ్వెటుపోతున్నావు. పద...పద...'' అని తిరిగి ఇంట్లోకి లాక్కెళ్లాడు యాదగిరి మిత్రుడు భానుప్రకాష్.


తన భార్య చంచలాక్షిని పరిచయం చేశాడు.

తరువాత భానుప్రకాష్, యాదగిరి వేరే గది లోకి వెళ్లిపోయారు. చంచలాక్షిని తనతోపాటు తీసుకెళ్లింది చాందిని.

ఈలోగా భానుప్రకాష్ ఇల్లంతా కలియదిరిగాడు.

''భేష్! నీ ఇంటి ప్లాన్ చాలా బాగుంది. వీలైతే నీ ఇంటి ప్లాన్ నాకోసారి ఇవ్వు. నేనూ ఇలాగే కట్టుకుంటా'' మెచ్చుకుంటూ అడిగాడు భానుప్రకాష్.



''అలాగే...ఇప్పుడే ఇస్తా...'' అని లోనికి నడిచాడు యాదగిరి.

సరిగ్గా...అప్పుడే చాందిని వస్తు ప్రదర్శన ప్రారంభించింది.

అంతేకాదు మొట్టమొదటే యాదగిరి ఏదైతే వద్దని షరతు విధించాడో అదే తీసి చూపిస్తోంది.

గోడకి బుర్రను బాదుకుని చావాలని పించింది యాదగిరికి. ఆముదం త్రాగిన మొహం పెట్టుకున్న అతన్ని చూస్తూ కూడా లెక్క చేయలేదు చాందిని.

అక్కడ నుండి తిరిగి మిత్రుడి దగ్గరకు వెళ్లిపోయాడు.

''థ్యాంక్స్... నీ ప్లాన్ నీకు తిరిగి అందిస్తా'' కృతజ్ఞతలు తెలిపాడు భానుప్రకాష్.

''మీ శ్రీమతిగారి హాబీ అద్భుతం సార్. తన పుట్టింటివారిచ్చిన ఆభరణాలు భద్రంగా దాచుకోకుండా నలుగురికీ చూపిస్తూ దాని పుట్టుపూర్వోత్తరాలు కూడా వివరించి చెప్పడం మరీ గొప్ప...'' పొగిడింది చంచలాక్షి.

''విషయం ఏమిటి... మీలో మీరు చూపించుకోవడమే గానీ మాకూ చూపించవచ్చుగా...'' భానుప్రకాష్ అలా అనగానే యాదగిరి గుండెల్లో రాయిపడింది.

ఎక్కడ చాందిని ప్రదర్శనకు సిద్ధపడుతుందోనని... కానీ చంచలాక్షి భర్తతో...''మీకు ఇంటికెళ్లాక చెబుతాలెండి'' అని సర్దేసింది.

భోజనాలు చేశాక గాని వాళ్ళు కదలలేదు.

తరువాత యాదగిరి చాందినిపై గయ్యమని లేచాడు.

''నీకేం చెప్పాను.... నువ్వేం చేస్తున్నావు. 'అది' మాత్రం చూపించవద్దన్నానా? అసలే భానుగాడు కొంటె వెధవ. ఆఫీసులో అందరికీ చాటింపేస్తాడు... ఛ! నా పరువు గోదాట్లో కలుస్తుంది''

''ఆగండి! మీరేదేదో వాగకండి. నా దగ్గరున్న వస్తువులను ఇతరులకి చూపించడం చిన్నప్పటి నుంచీ నాకలవాటు''

''అది పసితనం... దేనికైనా ఓ హద్దుపద్దు వుండాలి..''కస్సుమన్నాడు.

''నా వస్తువులు... నా ఇష్టం'' ఠక్కున అనేసింది చాందిని.

''మరోసారి ఈ ఇంట్లోకి వచ్చినవారెవరికీ చూపించడానికి వీల్లేదంతే'' కటువుగా హెచ్చరించాడు.

వీధిలోకి చికాగ్గా వెళ్లిపోయాడు యాదగిరి.

★ ★ ★

''ఎక్కడినుంచొస్తున్నావు...ఆ పెట్టేంటి?'' నిలదీశాడు యాదగిరి.

''కొత్తగా మహిళామండలి పెట్టారు. 'అచ్చట్లు-ముచ్చట్లు' కార్యక్రమంలో వెరైటీగా వుంటుందని ఆభరణాలు, వాటి వెనుక వున్న చరిత్రను చెప్పడానికి నన్ను ఆహ్వానించారు. చంచలాక్షి నా గురించి చెప్పిందట...'' లోనికి అడుగుపెడుతూ అంది చాందిని.

అంతే! భార్య చేతిలోని పెట్టె లాక్కుని వస్తువులన్నీ క్రింద వంపి, దాంట్లోంచి 'ఆ' వస్తువును తీసి ''ఛ..దీన్ని చెరిపించేసి నామెళ్ళో గొలుసు చేయించుకోకపోతే ఒట్టు...''కసిగా అన్నాడు.

''మీ ఒట్టు గట్టుమీద పెట్టండి. మీరే ఆ పని చేసిననాడు నేను ఉరేసుకోవడం ఖాయం...'' అని నేలమీద వస్తువులను పెట్టెలోకి ఎత్తింది.

''మరోసారి గాని దాన్ని బయటకు తీసి ప్రదర్శించావో...''

''ఆ..ఏం చేస్తారండి? మా తాతగారి ప్రేమ కానుకను మీరు ఎద్దేవా చేస్తారా'' తెగించి అంది.

''గొప్పకానుకే ప్రసాదించాడు మీ తాత... అది నా కొంపముంచుతోందిప్పుడు'' చికాగ్గా అన్నాడు.

''మీకిష్టం లేకపోతే నేను పుట్టింటికి పోతా...'' ముక్కు చీదింది చాందిని.

సరిగ్గా ఆ సమయంలోనే యాదగిరి మామగారు హిరణ్యమూర్తి దిగాడు.

''రండి....రండి... సమయానికి దిగారు''

## హైకూలు

- ఎస్.ఎస్.శ్రీనివాస్

చిమ్మచీకటి
నీడతోడు లేకుండా
ఒంటరిమనిషి



తనువుల్ని
తాడులా అల్లుకుంటూ
పెనపాములు



గడియారపు శబ్దం
రాత్రి గుండె చప్పుడుతో
లయిస్తూ


రాజకీయుల విందు
తెల్లారి తుప్పల్లో
రక్షిత ప్రాణుల ఈకలు






ప్రాణం తీస్తూ
ప్రాణం పోస్తూ
రూపాయి

పాతబడినా
పాడుతూనే
తాత రేడియో



అని జరుగుతున్నదంతా వివరంగా పూసగుచ్చి నట్లు చెప్పాడు.

అంతా విని ''ఓస్! ఇంతేనా...దానివల్ల ఏమైందని.. చిన్నప్పటినుంచీ దానితత్వమే అంత...'' నవ్వేస్తూ అన్నాడు హిరణ్యమూర్తి.

ఏదో పెద్దమనిషని విన్నవిస్తే అదీ గుండు సున్నయ్యింది. ''మీకు నవ్వులాటగా వుందిగాని నాకు మహామంటగా వుంది. మీకు మీ అమ్మాయి చేసింది న్యాయమనిపిస్తే మీతో తీసుకుపోండి'' కటువుగా చెప్పాడు యాదగిరి.

''పోనీలే మా అమ్మాయి నాకు గుదిబండ కాదులే. ఒంటిపిల్లిలా వుండు. తీసుకుపోతా'' కోపంగా అన్నాడు హిరణ్యమూర్తి.

చాందిని తనవెంట తీసుకువెళుతున్న సామాన్లతో పాటు ఆ 'పెట్టె' తీసుకెళ్లడం మరిచిపోలేదు.

★ ★ ★

ఇది జరిగి నెల దాటింది.

స్వయంపాకం మహానరకంలా వుంది యాదగిరికి. నలుగురు నాలుగురకాలుగా ప్రశ్నించారు. కొందరు ఏదో 'విశేషం' ఉండి పుట్టింటికి పంపి ఉంటాడని ఊహాగానాలు ప్రారంభించారు.

ఇలా వుండగా మామగారినుండి ఉత్తరం–చాందిని నీళ్ళు పోసుకుందని, రమ్మని సారాంశం.

అయినా భీష్మించుక్కూచున్నాడు యాదగిరి. అత్తారింటికి వెళ్లలేదు. భార్య రెండుత్తరాలు రాసింది. జవాబీయలేదు. నెలలు గడిచాయి. అప్పుడు వచ్చిందో ఉత్తరం.

''శ్రీవారికి– మీ చరణదాసి చాందిని. మీకింతకుముందు చాలా ఉత్తరాలు రాశాను. జవాబు లేదు. మీకంత పట్టుదల మంచిదికాదు. ఇప్పుడు అసలు విషయం రాస్తున్నాను. మీరు తండ్రి అయినారు. ఈ సంగతి తెలిసి మీరు రావాలి. బిడ్డ పుట్టాక కూడా మీరు రాలేదంటే మీకింకా నా మీద కోపం పోలేదన్నమాట. అసలు సంగతి మన బిడ్డ పుట్టి మన సమస్యను ఓ ఒడ్డుకు చేర్చిందంటే మీరు నమ్మరేమో! ఇది తెలిసినా మీరు రాకపోతే నేనెంత బాధపడతానో మీకు తెలీదు. తప్పకవస్తారని ఆశ.

ఇట్లు<br>మీ ధర్మపత్ని<br>చాందిని''

అంతలా ఒత్తిడి చేస్తూ ఉత్తరం రాసింది కాబట్టి యాదగిరి తన పట్టుదల సడలించుకున్నాడు. మర్నాడే అత్తారింటికి బయలుదేరాడు.

అల్లుడిరాక చూసి సంతోషిస్తూ–''వెళ్ళవోయ్ అల్లుడూ! నీ సంతానాన్ని తనివితీరా చూసుకో...'' ఆప్యాయంగా భుజం తట్టాడు హిరణ్యమూర్తి.

గబగబలోనికి వెళ్లి భార్య చాందిని ప్రక్కన ఉయ్యాలలో ఉన్న బిడ్డను చూశాడు.

''చూడండి మన సంతానాన్ని...''అంది భర్తను ఆనందంగా చూస్తూ చాందిని.

''ఆడబోయిన తీర్థమెదురైందన్నట్లుగా మీ ఇద్దరికీ సమస్య తీర్చింది''అని పైనున్న బట్టను తొలగించి బిడ్డను చూపించాడు హిరణ్యమూర్తి.

ఆ పసిపాప కాళ్ళు తపతపలాడించింది. అంతే హాయిగా నిట్టూర్చాడు యాదగిరి.

ఆరోజు సరదాగా గడిపి మర్నాడు వెళ్లిపోతూ ''మరో పదిరోజుల్లో అమ్మాయిని దిగబెట్టండి'' సంతోషంగా అన్నాడు యాదగిరి.

★ ★ ★

చాందిని బిడ్డతో తిరిగి రాగానే ఇల్లంతా కళకళలాడింది.

ఒకరోజు యాదగిరి ఆఫీసునుండి తిరిగి వచ్చేసరికి చాందిని మామూలుగా తన ఆభరణాలు చూపిస్తోంది. ఈసారి మాత్రం ఎటువంటి కోపం గాని, జుగుప్స గాని కలగలేదు యాదగిరికి.

''ఇది పాపిడి పిందె.... రవ్వలనెక్లెస్... వడ్డాణం'' వరసగా చూపించింది.

అందరూ ఎంతగానో కొనియాడారు.

మధ్యలో లేచి వెళ్ళి పాపాయితో తిరిగి వచ్చింది చాందిని.

''మీ పాప చాలా బాగుంది...'' పొగిడారు, ముద్దులాడారు.

కిటికీలోంచి చూస్తున్న యాదగిరి పులకించిపోయాడు.

''ఇదిగో...ఇది...నాదే.. నా చిన్నప్పుడు మా తాతగారు ప్రేమతో చేయించారు. ఇప్పుడు మా పాపాయికి పనికి వచ్చింది. రెండుతులాల బరువు...'' ఇంకా ఏవేవో చెప్పుకుపోతోంది. వాళ్లంతా ఘొల్లున నవ్వుతున్నారు.

భార్య ఆడిన ప్రతీమాటా ఒక తూటాలా యాదగిరి గుండెను చీలుస్తోంది. బుర్ర బద్దలు కొట్టుకోవాలనిపించింది.

అంతలా అతగాడిని అతలాకుతలం చేసిన ఆ వస్తువేదో మీరీపాటికి పసిగట్టకపోతే మీరుత్తి వెర్రివాజమ్మలే!

★

